# ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు



**ఒక జ్ఞాపకం**

ఎండాకాలం సెలవులు........ఇంటి నిండా పిల్లలు....... నడి ఎండవేళ పెరటి వేపచెట్టుకింద బొమ్మరిళ్ళ నిర్మాణం.... బడివెనుక ఎదరామేల్ సవాల్.. జేబుల నిండా గోలీల గలగలలు.... చింత గింజలను ఎగరగొట్టే రెప్పలు... కోడింబిళ్ళా.... వస్తారా.... ఓడిన వాళ్ళు మోచేతులతో దేకాలి... పరుగెత్తు... పరుగెత్తు... దొరక్కుండా తప్పించుకో ... దాకుళ్ళు మూకుళ్ళు ... అవుస్ బాయ్... బాలు విసురుతున్నా తప్పించుకో ... పిళ్ళారి మాయ పడిపోయింది.... లగెత్తు... చిటికెన వేలి మీద బొంగరం గరగరా... ఆడపిలకాయలూ ... ఎండనబడి తిరక్కండి, కానగ చెట్టు కిందకి చేరి బుజ్జిలకూళ్ళు ఒండుకోండి... టుపాకితో కాల్చేస్తుండా... పడిపో... పడిపో ...ఢాం... ఢాం... ఢాం... ఒరేయ్ ఏందీ రామందాడి... ఎండకిబోసిన ఒరుగులు తొక్కేస్తా ఉండారు. చెట్లకిందకి పొయ్యి ఆడుకోబోండి... రేయ్‌వస్తారా... కలిక్కాయలకి అడివిలొకి పోదాం... బావుల్లో ఈదులాడి... అమ్మకి దొరక్కుండా తల ఆరబెట్టుకుని ఇంటికి తిరిగొస్తే ఎర్రటి కళ్ళు చూసి దబీ...దబీ... బాదుడు... ఒడుపుగా సీమచింత ముళ్ళను తప్పించుకుంటూ చెట్టెక్కి కోసిన సంచుల కొద్దీ కాయలు... కడుపునిండా బొక్కి... నాన్నకి వాసన దొరక్కుండా నమిలిన తులశాకు రెమ్మలు...

పేడకోసం ఊరి గొడ్ల వెనక పరుగులు... తాటి తోపులో కల్లుచుక్క రుచి... కట్టకింద గుంపుగా చేరి లాగిన బీడీ దమ్ము ఘాటు... వెన్నెల రాత్రి వీధిలో చెడుగుడు... హార్మోనియం పెట్టె ముందు గురువుగారి భాగోతం పద్యాల పాఠాలు... నిశ్శబ్దపు చీకటి రాత్రి తాత చెప్పే దెయ్యం కథలు... రెప్ప వాలగానే కలలోకి వచ్చే యేటి వంకలోని ఊడల మర్రి చెట్టు... అరుపులు... పరుగులు... నవ్వులు... తుళ్ళింతలు... వేసవి అంటే వేడి సెగల ఉక్కపోత కాదు, ఆటపాటల ఆనందపు ఉప్పెన.

**ఒక వాస్తవం**

వేసేయండి తలుపులు... వెరీ హీట్... కూలర్ఆన్ చెయ్యండి... కర్టెన్లు తడపండి... పెప్సీ... మాజా... డీప్ ఫ్రీజర్‌లో వాటర్‌బాటిల్... నోమోర్ నాయిస్... కీప్ క్వయిట్... టీవీ తెరమీద కార్టూన్ నెట్‌వర్క్ ... పోగోలో మిస్టర్ బీన్... అప్పుడప్పుడూ డిస్కవరీ... పాటలు... విసుగెత్తిందా...

ఒక డివిడిలో మూడు సినిమాలు... లేటెస్ట్ రిలీస్... డాడీస్ సమ్మర్ గిఫ్ట్ వీడియో గేమ్ ప్లేయర్... సెల్‌ఫోన్‌లో మారే రింగ్ టోన్స్ ... ఎస్ ఎం ఎస్... హలో బాబాయ్ మీ ఊళ్ళో టెంపరేచర్ ఎంత... ఇక్కడ టూమచ్ ... బొమ్మలకు రంగులేయి... చుక్కలు కలుపు... దారి కనుక్కో చూద్దాం... వర్డ్ పజిల్... మెదడుకు మేత.. ప్రాజెక్టు వర్క్ ఉందిగా ...

అంకుల్ కార్గిల్ వార్ పిక్చర్స్ ఏ సైట్‌లో దొరుకుతాయి. బ్రౌజ్... బ్రౌజ్... డబ్ల్యు.డబ్ల్యు.వైట్‌హౌస్. కామ్... చీ ఏమిటేమిటో వస్తున్నాయి.... యుఎస్ అఫీషియల్ సైట్ ఏమిటబ్బా ... చాట్... చాట్... టూమే తెలీదు...

నాన్నా చాట్ బండిలో పానీ పూరీ బావుంటుంది. బోర్ కొడుతుంది. కుర్‌కురే పట్టుకురా... ధరలు మరీ మండి పోతున్నాయి. పుచ్చకాయ ఫార్టీ రుఫీసా... మేంగోస్ పట్టుకురండి... మిల్‌కషేక్ చేసిస్తా... టెన్త్ బుక్స్ హాలిడేస్‌లోనే పూర్తి చేసెయ్యండి. ... గ్రాండ్ వరల్డ్‌కి వెళ్దామా ఒక రోజు ... ఎంట్రన్స్ ఒన్‌ఫిఫ్టీ... ఈవెంట్స్ ఎక్స్‌ట్రా ... ఫుడ్ కాస్టా... అయినా వెళ్ళాంతే... అమ్మమ్మ వాళ్ళ ఊరా... వెరీ బోర్... కరెంటుండదు... ఒకటే చెమట... ఇక్కడే బెటర్... తలుపులు వేసేసుకుని హాయిగా ఫ్యాను కింద గడిపేయవచ్చు... ఎటు చూసినా గోడలు... పగలూ రాత్రీ... చుట్టూ గోడలు ... లోపలా బయటా ... గోడలే గోడలు... వేసవి అంటే వినోదాల సెలవులు కాదు, మనసుకూ శరీరానికి బందిఖానా.



**ఉమామహేశ్వరరావు**

**(రచయిత :**
**ఆంధ్రజ్యోతి తిరుపతి ఎడిషన్ న్యూస్ఎడిటర్)**